క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా



జి.సిగడాం: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్‌ఐ వై.మధుసూదనరావు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలని కోరారు. స్త్రీలు తాము ధరించే బంగారు ఆభరణాలపై జాగ్రత వహించాలని సూచించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గణిత క్విజ్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

జి.సిగడాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గణిత క్విజ్ పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీల్లో జి.సిగడాం జెడ్పీహెచ్ స్కూల్, మోడల్ స్కూల్, ఎందువ జెడ్పీ పాఠశాల విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. గెలిపొందిన విద్యార్థులకు హెచ్‌ఎం పీవీఎస్ మూర్తి, గణిత ఉపాధ్యాయుడు కుప్పిలి రవికుమార్ పట్నాయక్ చేతులమీదుగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన గణిత ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. లావేరు మండలంలోని లావేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా క్లాసులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా చేయడం వలన ఏకాగ్రత పెరుగుతుందన్నారు. అనంతరం పలు ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు టి.వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ కిరీటానికి విరాళాలు



విరాళాలు అర్చకునికి అందజేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక డీసీసీబీ కాలనీలోని భూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కొలువైన వేంకటేశ్వర స్వామివారికి బంగారు కిరీటం చేయించే నిమిత్తం పలువురు భక్తులు విరాళాలు అందించినట్లు అర్చకులు గోపాలాచార్యులు ఆదివారం తెలియజేశారు. గణపతిరావు, మధుబాబులు ఒక గ్రాము బంగారం, అర్జునరావు, రంగనాయకమ్మ దంపతులు రూ.10,511లు, బొడ్డేపల్లి ఆనందరావు, కళావతి దంపతులు రూ.10 వేలు, బుడుమూరు గోవిందరావు, అమరవాణి దంపతులు రూ.10,116లు అందజేసినట్లు వెల్లడించారు.

11న ఆలయ వార్షికోత్సవం



లక్ష్మీ గణపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో వేంచేసిన లక్ష్మీ గణపతి ఆలయ 13వ వార్షికోత్సవం ఈనెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు షిరిడీ సాయి సేవా సంఘం ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దీనిలో భాగంగా స్వామివారికి అభిషేకాలు, హోమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా 30వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. నగరంలోని పీఎస్‌ఎన్‌ఎంహెచ్ స్కూల్ ప్రాంగణంలో జరుగుతున్న పోటీల్లో కుర్రకారు జోరు ప్రదర్శిస్తున్నారని నిర్వహణ కమిటీ ముఖ్య ప్రతినిధులు వి.విజయ్‌కుమార్, బి.ప్రసాద్ తెలిపారు. పలు జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరై కండల ప్రదర్శనలో పాల్గొంటున్నారు. విజేతలకు రూ.1.25 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నారు.

వసతుల లేమి.. కనవయ్యా స్వామి..!

- ఆది కూర్మక్షేత్రంలో అవస్థలు
- పార్కింగ్‌కు తప్పనిపాట్లు
- ఎండలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి
- ఆవేదన వ్యక్తం చేస్తున్న భక్తజనం



శ్రీకూర్మనాథుని దర్శనానికి వేచి ఉన్న భక్తులు

గార: మండలంలోని శ్రీకూర్మనాథాలయం వైశాఖ మాస తొలి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అయితే అదే సమయంలో భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు వసతుల కల్పన లేకపోవడంతో అవస్థలు పడ్డారు. కారు, ఆటో, బైక్‌లు పెట్టేందుకు స్థలం చూపించకపోయినా, ఆశీలు వసూలు చేస్తుండడంతో గందరగోళానికి గురయ్యారు.

అడుగడుగునా అవస్థలు

ఆలయంలో యథావిధిగా జరుగుతున్న సేవాకాలం, భోగం నివేదనలతో పాటు ఆదివారం నాడే శ్రీరామానుజాచార్యుల మాస నక్షతం కావడంతో ఎక్కువ సమయం భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. వాస్తవంగా శ్రీకూర్మనాథాలయం గర్భగుడికి ఒకటే మార్గంలో వెళ్లడం, రావడం ఉండడంతో భక్తులు అవస్థలు పడుతున్నారు. అలాగే తాబేళ్ల పార్కు వద్ద అరు బయటే టిక్కెట్లు అమ్మే పరిస్థితి ఉంది. ప్రసాదం కూడా రుచి తగ్గిందని భక్తులు వాపోతున్నారు. రూ.20ల క్యూలో ఉన్న భక్తులు ఎండలోనే ఉండాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సేవాకాలం మార్పుతో ఇబ్బంది

ఉదయం 8 గంటలకే ఆలయ సాంప్రదాయం ప్రకారం బాలభోగం నివేదన జరగాలి.



చల్లకంబాల, ఆలయ ప్రధాన ద్వారం మధ్యలో పార్క్ చేసిన బైక్‌లు

మధ్యాహ్నం ప్రాంతంలో రాజభోగం నివేదన చేయాలి. కానీ ఆదివారం అలా చేయకుండా బాలభోగం, రాజభోగం రెండు సేవాకాలాలు ఒకేసారి చేపట్టారు. దీనికి తోడు ఆరుద్ర నక్షత్రయుత రామానుజాచార్యుల మాసతిరు నక్షత్రం కావడంతో మరో సేవాకాలం తోడయ్యింది.

విధులకు సిబ్బంది గైర్హాజరు

ఆలయ సిబ్బందిలో అధిక సంఖ్యలో ఇన్‌చార్జిలే ఉండడం, అందరూ విధుల్లోకి హాజరవ్వకపోవడంతో భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది. ఉచిత దర్శనం వద్ద సుమారు 90 నిమిషాలు ఆలయ తలుపులు తెరుచుకోలేదు. ఉచిత దర్శనం దక్షిణ ద్వారం వద్ద భక్తులు వెళ్లకుండా సెక్యూరిటీ అడ్డుకున్నారు. రూ.20లు దర్శనానికి భక్తులను ముందుగా విడిచిపెట్టి, ఉచిత దర్శనం కోసం వేచి ఉన్న భక్తుల సహనాన్ని పరీక్షించారు. దీంతో భక్తులు ఆలయ అధికారులు, సిబ్బందిపై మండిపడ్డారు. ఆలయ ఈవోగా ఉన్న జి.గురునాథరావు పలాస గ్రూపు టెంపుల్స్ ఈవోగా ఉన్నారు. ఇక్కడ ఇన్‌చార్జి ఈవోగా వ్యవహరిస్తున్నారు. కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగి నర్సుబాబు కూడా రికార్డు నమోదు చేసే అధికారిగా ఉన్నారు. మిగిలిన వ్యక్తులు ఔట్ సోర్సింగ్ సిబ్బందే కావడంతో సమస్యలు నెలకొంటున్నాయి. శ్రీకాకుళం నుంచి సేవకు శని, ఆదివారాల కోసం ప్రైవేటు సెక్యూరిటీని వినియోగించుకుంటున్నారు. ఎక్కువ మంది ప్రైవేటు వ్యక్తులే విధుల్లో ఉండడం కొసమెరుపు.



క్యూలో ఎండలోనే వేచివున్న భక్తులు

ఇబ్బందులు లేకుండా చూస్తాం



భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. ప్రతిరోజూ ఉదయం జరిగే సేవాకాలంలో మినహా ఆలయం సాయంత్రం 8.30 గంటల వరకు తెరిచే ఉంచుతున్నాం. ఎండలో భక్తుల ఉండాల్సిన పరిస్థితిపై దృష్టి సారించాం. భక్తులకు మంచినీరు అందేవిధంగా ఇప్పటికే చర్యలు చేపట్టాం.

– జి.గురునాథరావు, ఆలయ ఇన్‌చార్జి ఈవో, శ్రీకూర్మనాథాలయం

ఎండలోనే ఉండాల్సి వచ్చింది



శ్రీకూర్మనాథాలయం క్యూలైన్ నీడలో లేకపోవడంతో ఎండలోనే ఉండాల్సి వస్తోంది. కుటుంబ సభ్యులతో వస్తే ఇబ్బందులు పడుతున్నాం. ఆలయ అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలి. దర్శనానికి చాలా సమయం పడుతోంది. ఉదయం నుంచి చాలా సమయం వేచి ఉండాల్సి వచ్చింది. సమయపాలన లేదు. అంతేకాకుండా తాబేళ్ల పార్కులో తాబేళ్ల ఆహారం పేరిట డబ్బులు వసూలు చేయడం సమంజసం కాదు. ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

– ఆర్.రామకృష్ణ, భక్తుడు, మంచిర్యాల

ఆదిత్యుని సన్నిధిలో విద్యుత్ చీఫ్ జనరల్ మేనేజర్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్) టీవీఎస్‌ఎన్ మూర్తి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సాంప్రదాయం ప్రకారం అధికారులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అర్చకులు ఆలయ విశిష్టతను వివరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు, డిప్యూటీ ఈఈ చల్లా వేంకటేశ్వరరావు, డీ–1 ఏఈ సురేష్‌కుమార్, జిల్లా విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘ అధ్యక్షుడు ఉంగటి పాపారావు, గార ఏఈ కమల్ హాసన్ తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్యుని చిత్రపటంతో సీజీఎం మూర్తి దంపతులు

యాళ్లపేటలో సత్యసాయి పల్లకీ సేవ



పూజలు చేస్తున్న సత్యసాయి భక్తులు

గార: మండలంలోని యాళ్లపేట గ్రామంలో సత్యసాయి పల్లకీ సేవను ఆదివారం వైభవంగా చేపట్టారు. స్థానిక యువజన విభాగం, భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో సత్య సాయి చిత్రపటానికి గ్రామంలో తిరువీధి నిర్వహించారు. పల్లకీ ముందు మహిళలు కలశాలతో బయల్దేరగా, ప్రతీ ఇంటి వద్ద భక్తులు హారతులు పట్టారు. కార్యక్రమంలో జోనల్ సమన్వయకర్త చరణ్, గార మండల సమన్వయకర్తలు కె.ఆదినారాయణ, సాయిరాం పట్నాయక్, శివ, నాయుడు, రామకృష్ణ, రాజు, సూర్యనారాయణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ముగిసిన కమ్మ సిగడాం జాతర

రణస్థలం: మండలంలోని కమ్మ సిగడాం పంచాయతీలో మహాలక్ష్మి తల్లి మూడు రోజుల జాతర ఆదివారంతో ముగిసింది. చివరి రోజున అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. అమ్మవారికి భక్తులు చీరలు, పసుపు–కుంకుమతో పాటు గాజులు, ప్రసాదాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సూదుర ప్రాంతాల నుంచి నాటుబండ్లు, ఆటోలు, ఇతర వాహనాల్లో భక్తులు విచ్చేసి జాతరను ఎంతో ఆనందంగా గడిపారు. సూదుర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, రణస్థలం ఎంపీపీ పిన్నింటి రజిని, వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకుడు పిన్నింటి సాయికుమార్, సూర శ్రీనివాసరావు తదితరులు దర్శించుకున్నారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు.



భక్తులతో రద్దీగా ఉన్న మహాలక్ష్మి తల్లి ఆలయం

ఈ నగరానికి ఏమైంది..?

- పెరిగిపోతున్న ఆకతాయిల ఆగడాలు
- మద్యం, గంజాయి మత్తులో దాడులు
- కళాశాలలు, హైస్కూళ్ల వద్ద వికృత చేష్టలు



శ్రీకాకుళం: నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, ఉన్నత పాఠశాలల వద్ద ఆకతాయిల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. వారం రోజుల క్రితం మహిళా కళాశాల ప్రాంగణంలో ఒక విద్యార్థినిపై తీవ్రంగా దాడి చేసిన విషయం జిల్లా ప్రజలు మరిచిపోక ముందే, శుక్రవారం సాయంత్రం శ్రీచైతన్య కళాశాల సమీపంలో ఒక విద్యార్థినిపై వేధింపులకు పాల్పడ్డారు. దీనిని వారించిన అధ్యాపకుడిపై సైతం దాడికి తెగబడడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

ఉదయం, సాయంత్రం వేళల్లో...

పాఠశాలలు, కళాశాలల వద్దకు ఉదయం, సాయంత్రం వేళల్లో కొందరు ఆకతాయిలు చేరుకుంటున్నారు. ఆ సమయాల్లో విద్యార్థినులను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరిస్తున్నారు. బైక్‌లపై అతివేగంగా దూసుకెళ్తున్నారు. ఇటీవల కాలంలో గంజాయి, మద్యం మత్తులో ఆకతాయిలు వికృతంగా ప్రవర్తిస్తున్నారు. పోలీసులు అతివేగాన్ని, ఎక్కువ శబ్దాలను ఇచ్చే వాహనాలను నియంత్రించేలా చర్యలు చేపడుతున్నా ఫలితం లేకుండా పోతుంది. ముఖ్యంగా 80 అడుగుల రోడ్డు, మహిళా కళాశాల రోడ్డు, ఆర్ట్స్ కాలేజీ రోడ్డు, టీపీఎం హైస్కూల్ సమీపంలో ఆకతాయిల బెడద తీవ్రంగా ఉంది. పోలీసులు ఆయా ప్రాంతాలపై నిఘా ఉంచి పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టు పడే పరిస్థితి కనిపించడం లేదు. ఇలాంటి ఘటనల్లో ప్రజలను కూడా భాగస్వాములు చేసి తగిన చర్యలు తీసుకుంటే తక్కువ కాలంలోనే ఆకతాయిల ఆగడాలను నివారించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పటిష్ట నిఘా



పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల వద్ద సోమవారం నుంచి పటిష్ట నిఘా ఉంచుతాం. ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. ఎక్కువ శబ్దం, వేగంతో వెళ్లే ద్విచక్ర వాహనదారులపై పోలీసులకు నేరుగా ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం

భయమేస్తోంది



ద్విచక్ర వాహనాలపై కొందరు అతివేగంగా వెళ్లడంతో పాటు పెద్దపెద్ద శబ్దాలు చేయడం వలన భయమేస్తోంది. మహిళలు, విద్యార్థులపై కొందరు ఆకతాయిలు ప్రవర్తిస్తున్న తీరు ఆందోళన కలిగించేలా ఉంది. పోలీసులు చర్యలు తీసుకోవాలి.

చండీరాణి, విద్యార్థిని, శ్రీకాకుళం

బెడద ఎక్కువగా ఉంది



కళాశాల వద్ద ఆకతాయిల బెడద ఎక్కువగా ఉంది. బయటకు చెప్పుకోలేని విధంగా కొందరు విద్యార్థులు, మహిళలపై కామెంట్లు చేస్తున్నారు. అలాంటి ఆకతాయిలను ఎవరైనా ప్రశ్నించినా, అడిగినా దాడులు చేసేందుకు వెనుకాడడం లేదు. పోలీసుల నిఘా ఎంతో అవసరం.

సంధ్య, విద్యార్థిని, శ్రీకాకుళం

అన్నదానం



లావేరు మండలంలోని మురపాక గ్రామంలో జగన్నాథస్వామి ఆలయం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా మేలుకొలుపులో భజన గీతాలను ఆలపిస్తూ ప్రజల నుంచి సేకరించిన కానుకలతో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతీ ఏడాది సేకరించిన కానుకలతో అన్నదానం చేస్తున్నామని నిర్వాహకులు తెలియజేశారు.

– ఎచ్చెర్ల

కమ్మేసిన పొగమంచు



గత కొన్ని రోజులుగా ఎచ్చెర్లలో దట్టంగా పొగమంచు కురుస్తోంది. దీంతో జాతీయ రహదారిపై వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఆదివారం ఉదయం దాదాపు 9 గంటల వరకు పొగమంచు కురవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

శ్రీకూర్మనాథుని గేట్ వే



ఉత్తరప్రదేశ్‌లో గత కొద్దిరోజులుగా జరుగుతున్న మహా కుంభమేళాలో దేశంలోనే ఏకైక కూర్మావతార ఆలయమైన శ్రీకూర్మనాథుని పేరున ప్రత్యేక గేట్‌ను నిర్మించారు. దీంతో మన జిల్లా నుంచి వెళ్లిన భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆ గేట్ వద్ద ఫొటోలు దిగుతూ సోషల్ మీడియాలో ఆనందంగా షేర్ చేస్తున్నారు.

– శ్రీకూర్మ

వత్సవలసకు ప్రత్యేక బస్సు

శ్రీకాకుళం అర్బన్: వత్సవలస రాజులమ్మ తల్లి యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. శ్రీకాకుళం ఒకటో డిపో పరిధిలో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వత్సవలసకు ప్రత్యేక బస్సులు వేశారు. ఈ యాత్రకు రాజులమ్మ తల్లి భక్తులు శనివారం రాత్రి బయల్దేరి ఆదివారం తిరుగు ప్రయాణం అవుతారు. ఈ బస్సులు కాంప్లెక్స్ నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒకటి చొప్పున ప్రయాణికులకు అందుబాటులో ఉంచడం జరుగుతోందని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు తెలిపారు. యాత్ర మొదటి వారం కావడంతో ఈ వారం 8 బస్సులను అందుబాటులో ఉంచడం జరిగిందని, రెండో వారం అధికంగా రద్దీ ఉంటుందని భావిస్తున్నామన్నారు. అందువలన యాత్ర రెండో వారం 10 బస్సులను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.



వత్సవలస యాత్రకు వెళ్తున్న ప్రత్యేక బస్సు

15 నుంచి విద్యార్థులకు పోటీలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఈనెల 15వ తేదీ నుంచి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా, వ్యాస రచన, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బోర గోపి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఏబీవీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్, కళాశాల గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. సమావేశంలో సంఘ నాయకులు ఖేల్ కన్వీనర్ గుజ్జల టింకుల్‌కుమార్, శ్రీకాకుళం మండల కన్వీనర్ గుజ్జల జయప్రకాష్, అప్పలనాయుడు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కన్వీనర్ బోర గోపి

జీవకోటికి రక్షకుడు ఆదిత్యుడు

శ్రీకాకుళం కల్చరల్: అన్ని జీవాలకు రక్షకుడు సూర్యుడని వక్త రంగడు ప్రసాదరావు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో ద్వాదశాదిత్య ఆరాధన అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాశీపట్నంలో ప్రతిష్ఠితమైన ద్వాదశ ఆదిత్యుల దర్శనం ఎంతో పుణ్యమని వివరించారు. వక్తను మందిరం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పి.పతంజలి శాస్త్రి, కోమలరావు, డాక్టర్ మోహనరావు, జి.విశ్వేశ్వరరావు, నిష్టల నర్సింహమూర్తి, కామేశ్వరరావు, సనపల నారాయణమూర్తి, కె.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రసాదరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

నాటకం అజరామరం

శ్రీకాకుళం కల్చరల్: నాటకం అజరామరమైనదని, జీవితాలకు దగ్గరగా ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక బాపూజీ కళా మందిర్‌లో ముత్యాలమ్మ కళానికేతన్, పీకే ఎంటర్‌టైన్‌మెంట్‌ల ఆధ్వర్యంలో శ్రీముత్యాలమ్మ నాటక కళాపరిషత్–2025 కేశిరెడ్డి రాజేశ్వరి అధ్యక్షతన ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ గొండు గంగాధరరావు, ఈఈ సుగుణాకరరావు, రెడ్‌క్రాస్ చైర్మెన్ పి.జగన్మోహనరావు, ఆర్ట్స్ సంస్థ కార్యదర్శి నూక సన్యాసిరావు, పాతటిక్కలి స్టేజ్ ఆర్టిస్టు రేజేటి బోసుబాబు, సూత్రా ఫౌండేషన్ వ్యవస్థాపకులు నిక్కు హరిసత్యనారాయణలు మాట్లాడుతూ కళాసేవ ఎంతో గొప్పదని, సేవ చేస్తున్న నటి రాజేశ్వరి అభినందనీయురాలని కొనియాడారు. అనంతరం విజయనగరానికి చెందిన సంగీత విద్వాంసులు, పౌరాణిక కళాకారులు డాక్టర్ సురభి వెంకటరావు దంపతులను, శివశ్రీ నృత్య కళానికేతన్ నృత్య దర్శకుడు డాక్టర్ ఆర్.శ్రీకాంత్‌లను సత్కరించారు. శివశ్రీ నృత్య నికేతన్ చిన్నారులచే ప్రదర్శన ఆకట్టుకుంది.



శివశ్రీ నృత్య నికేతన్ చిన్నారుల నాట్య ప్రదర్శన